క్లుప్తంగా

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఎంజీ కృష్ణ



ఎర్రవల్లి చౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎంజీ కృష్ణ బహుజన సమాజ్ పార్టీ జోగుళాంబ గద్వాల జిల్లా నూతన ఇన్‌చార్జ్‌గా గురువారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ నియామక పత్రం అందజేశారు. జిల్లాలో బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మండలానికి చెందిన సీనియర్ నాయకుడు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

17 నుంచి ఆత్మగౌరవ పాదయాత్ర



గద్వాల అర్బన్: ఈ నెల 17వ తేదీ నుంచి ఆత్మగౌరవ పాదయాత్ర నిర్వహించనున్నట్లు నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో పాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి పాదయాత్ర చేస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో ఆ సమితి నాయకులు బుచ్చిబాబు, లవన్న, ప్రేమ్ రాజ్, పరుశరాముడు, గోపాల్, చిన్న రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



గట్టు: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని గంగిమాన్‌దొడ్డి సర్పంచు నర్సమ్మ, ఉప సర్పంచు సద్దల ఆంజనేయులు కోరారు. గురువారం గంగిమాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాల విద్యార్థుల బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మల్లేష్, అంగన్‌వాడీ టీచర్ సుగుణ, ఆశావర్కర్ ఈరమ్మ, వార్డు సభ్యురాలు లక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యనందించాలి



ధరూరు: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యా బోధనతో పాటు గుణాత్మక విద్యనందించాలని నోడల్ అధికారి నరేష్ అన్నారు. గురువారం మండలంలోని వామన్‌పల్లి పాఠశాలలో ఉప్పేరు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డెమో క్లాసులు టీచర్ రమాదేవి నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం వెంకటేశ్వర్‌రెడ్డి, రీసోర్స్ పర్సన్లు షేక్షావలి, పెద్దయ్య, ఐఈసీ స్టేట్ కో ఆర్డినేటర్ ఈశ్వరయ్య, మండల కో ఆర్డినేటర్ వెంకటేష్, సీఆర్‌పీ ఆజం పాషా, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ఫిర్యాదు



కేటీదొడ్డి: డ్రెయినేజీ కాలువపై అక్రమ కట్టడాలపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌గౌడ్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ఇల్లు నిర్మిస్తున్నారని వివరించారు. అదే విధంగా ఇంటి ముందు ఉన్న మురుగు కాలువను ధ్వంసం చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ నుంచి నోటీసులు ఇచ్చినా, గ్రామ పెద్దల చెప్పినా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

లక్ష్యం @ 13 లక్షలు

- 9వ విడత హరితహారం పనులు ప్రారంభం



ఎర్రవల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అలంపూర్ నియోజకవర్గంలో విరివిరిగా మొక్కలు నాటి హరిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎంతో కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో 124 పంచాయతీలకు 13 లక్షల మొక్కలను నాటడమే లక్ష్యంగా గ్రామానికో వన నర్సరీలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పాత నర్సరీలలో పెరుగుతున్న మొక్కలను నాటేందుకు సిద్ధంగా ఉంచారు. ఆయా మండలాల్లోని గ్రామాల వారిగా ఏర్పాటు చేసిన కొత్త నర్సరీలలో గ్రామ స్థాయిని బట్టి అధికారులు మొక్కలను పెంచుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

నియోజకవర్గంలో 124 గ్రామ పంచాయతీలుండగా మొత్తం 137 గ్రామాలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో కూడా మొక్కలను నాటడం కోసం ప్రభుత్వం పంచాయతీకో నర్సరీని ఏర్పాటు చేసింది. ప్రతి గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కల చొప్పున నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 13 లక్షల మొక్కలను పెంచడమే ప్రభుత్వం ప్రధాన లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. ఇందులో భాగంగా పెద్ద గ్రామాల్లో 10 నుంచి 12 వేల మొక్కలను నర్సరీలలో పెంచుతుండగా, చిన్న గ్రామాల్లో 8 నుంచి 10 వేల మొక్కలను పెంచుతున్నారు. దీనిలో భాగంగా పల్లెల్లోని నర్సరీలలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలు నిత్యం బ్యాగులలో మట్టిని నింపడం, మొక్కల విత్తనాలు నాటడం, వాటికి నిత్యం నీరు పెట్టడం వంటి పనులను ముమ్మరంగా చేస్తున్నారు. ముఖ్యంగా 9వ విడత హరితహారంలో భాగంగా పల్లెలు, పట్టణాలు అన్న తేడానే లేకుండా ఖాళీ స్థలాల్లో, రోడ్లకు ఇరువైపులా విరివిగా మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలను తీసుకుంటోంది.

నియోజకవర్గంలో ఆయా మండలాల వారీగా నర్సరీల్లో మొక్కలు పెంపకం లక్ష్యం ఇలా..

మండలం	జీపీలు	గ్రామాలు	నర్సరీలు	లక్ష్యం (లక్షల్లో)
ఇటిక్యాల	29	35	29	3.10
మానపాడు	16	17	16	1.70
అలంపూర్	14	15	14	1.40
రాజోలి	11	13	11	1.10
ఉండవెల్లి	16	16	16	1.70
వడ్డేపల్లి	10	10	10	1.10
అయిజ	28	31	28	2.90

నర్సరీలో మొక్కలు సిద్ధంగా..



పంచాయతీలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన నర్సరీని ఏర్పాటు చేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నర్సరీలో ప్రస్తుతం దాదాపుగా 10 వేల మొక్కలను పెంచుతున్నాం. ఇప్పటికే పలు రకాల మొక్కలు ఏపుగా పెరిగి నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని రకాల మొక్కలు ఎండకుండా చూసుకుంటున్నాం. 9వ విడత హరితహార లక్ష్యం చేరుకుంటాం.

– రవి, సర్పంచ్, ఎర్రవల్లి గ్రామ పంచాయతీ

విరివిగా మొక్కలను పెంచుతున్నాం



ప్రతి గ్రామంలో కూడా 9వ విడత హరితహారం కోసం నర్సరీలను ఏర్పాటు చేశాం. మేజర్ గ్రామాలలో 10 నుంచి 12 వేల మొక్కలను, చిన్న గ్రామాలలో 8 నుంచి 10 వేల మొక్కలను విరివిగా పెంచుతున్నాం. పాత నర్సరీలలో పెంచిన మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీలలో మొక్కలను సంరక్షిస్తున్నాం.

– రాఘవ, ఎంపీడీవో, ఇటిక్యాల

కనీస వేతనం ఇవ్వాలని నిరసన



కార్మిక శాఖ అధికారి మహేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: జిల్లాలో పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని గురువారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వీవీ నర్సింహులు హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులకు రూ.26వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్యబీమా, కార్మికులను పర్మినెంట్, బోనస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కార్మిక శాఖ అధికారి మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గట్టన్న, శంకర్, రాజు, మల్లేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ కిట్లు పంపిణీ



మానవపాడు: మండలంలోని అమరవాయి ఆరోగ్య ఉప కేంద్రంలో గురువారం డాక్టర్ శ్రీరామ్ ఆధ్వర్యంలో ఎన్‌సీడీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తప్పకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మాబి, ఆశలు కార్యకర్తలు యశోద, శోభ పాల్గొన్నారు.

చల్లాను కలిసిన నాయకులు



హైదరాబాదులో చల్లాను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అలంపూర్ నాయకులు

అయిజ: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడి ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గురువారం బీఆర్‌ఎస్ మండల నాయకులు చల్లా వెంకట్రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భీంపురం నరసింహారెడ్డి, ఉప్పల తిప్పన్న, బింగుదొడ్డి వెంకటేష్, ఈడిగోనిపల్లి రఘు, సింధనూర్ నరసన్న గౌడ్, నరేష్ తదితరులు ఉన్నారు.

అలంపూర్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈసందర్భంగా నియోజకవర్గ నాయకులు హైదరాబాదులోని అసెంబ్లీ వద్ద చల్లాను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజోళి: అలంపూర్ మాజీ ఎమ్మెల్యే చల్లా వెంకట్రామిరెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మండలంతో పాటు ఆయా మండలాల నాయకులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి ఖరారుపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లోకేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మాబి రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో పోతురాజు శంకరమ్మ సేవాదళం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురువారం ఎస్సై గోకారి హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ప్రయాణికుల దాహార్తిని తీర్చడం కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా కొండేరులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పోతురాజు బుచ్చన్న ప్రారంభించారు. కార్యక్రమంలో నాగరాజు, నాగన్న, బీచుపల్లి, సేవాదళం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రవన్న వర్ధంతి సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న హలీమ్

గద్వాల అర్బన్: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాజీ రాష్ట్ర కార్యదర్శిగా కామ్రేడ్ రవన్న 7వ వర్ధంతి సభను శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు డివిజన్ నాయకుడు హలీమ్‌పాషా అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి కామ్రేడ్ రవన్న వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు జమ్మిచేడు కార్తీక్, హరీష్, అంజి, నర్సింహ్మ తదితరులు ఉన్నారు.

పాఠ్య ప్రణాళికలపై చర్చ



కేటీదొడ్డి: మండలంలోని వాగుతండా ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసుగౌడ్ అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఈసీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఈశ్వరయ్య హాజరయ్యారు. ఐఈసీ విద్యా విధానంలో బోధన, ఎఫ్ఎల్ఎం పిరియడ్స్ ప్రణాళికపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు గీతాంజలి, రిసోర్స్ పర్సనల్‌గా సీతంనాయుడు, చిరంజీవి నాయుడు, కోఆర్డినేటర్ శ్రీను, సీఆర్‌పీ యుగందర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ధరూరు: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు డీఆర్ శ్రీధర్‌ల చిన్నాన్న డీఆర్ బస్వరాజు(65) గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ధరూరుకు చేరుకుని బస్వరాజు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కూతురు ఉన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, కేటీదొడ్డి ఎంపీపీ విజయ్, కేటీదొడ్డి మండల అధ్యక్షుడు ఉరుకుందు, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్‌నాయుడు, రాజారెడ్డి తదితరులు ఉన్నారు.

చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: రైతుల యొక్క వ్యవసాయ మోటర్ వైర్లను చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గోకారి తెలిపారు. మండలంలోని మొగిలి రావుల చెర్వు గ్రామానికి చెందిన సురేష్ చుట్టు పక్కల గ్రామాలలోని రైతుల పంట పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటర్ వైర్లను రాత్రివేళల్లో చోరీ చేసి విక్రయించేవాడు. ఈ క్రమంలో కొండేరులో అనుమానస్పదంగా తిరుగుతుండగా గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సురేష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీల వివరాలు తెలిసింది. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు బండి సంజయ్ రాక

అమరచింత: పట్టణానికి చెందిన అడ్వకేట్ వీరబ్రహ్మచారిని పరామర్శించడంతో పాటు బీజేపీ కార్యకర్తలతో జరిగే సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ అమరచింతకు వస్తున్నారని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మేర్వరాజు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు క్యామ భాస్కర్ తెలిపారు. పట్టణానికి చెందిన మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్వకేట్ వీరబ్రహ్మాచారి తండ్రి విశ్వనాథచారి దశ దినకర్మలో బండి సంజయ్ పాల్గొంటారన్నారు. అనంతరం ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేస్తారని తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని నిర్మూలిద్దాం



సర్పంచ్‌లకు అవగాహన కల్పిస్తున్న రమేష్

మదనాపురం: గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడుతున్నారని, దీనిని నివారించాలని మాస్టర్ ట్రెయినర్లు రమేష్, షరీఫ్ సూచించారు. గురువారం మదనాపురం ఎంపీడీఓ కార్యాలయంలో స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్ టు మార్గదర్శకాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు వీఏపీ ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేసి, ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వామ్యం చేయాలని కోరారు. ఇంకుడు గుంతల వాడకం, నిర్వహణ తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేంద్రం ఎంపీఓ పుష్పలత, రఘు, సత్యం, పాల్గొన్నారు.

మిషన్ అంత్యోదయపై సమావేశం

రాజోళి: మిషన్ అంత్యోదయ 2022 సంవత్సరానికి సంబంధించిన పనుల వివరాలను తెలపాలని ఎంపీడీఓ గోవిందు రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాలు సేకరించి అంత్యోదయ ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

శాంతినగర్: యువకుడి అదృశ్యమైన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం రాయచూరు జిల్లా, బాయ్‌దొడ్డి గ్రామానికి చెందిన ఉషమ్మ కుమారులతో కలిసి వడ్డేపల్లి మండలం తనగలలో నివాసం ఉంటోంది. ఈ నెల 6వ తేదీన పెద్ద కుమారుడు(17) ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఎంతకీ తిరగిరాకపోవడంతో చుట్టుపక్కల, బంధువులు ఇళ్లలో వెతికారు. ఆచూకీ తెలువకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కొనసాగుతున్న కంటి వెలుగు



అయిజలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న చిన్న దేవన్న



మానవపాడులోని జల్లాపురంలో..

అయిజ: మున్సిపాలిటీలోని 9వ వార్డులో మాలపేటలోని కమ్యూనిటీ హాల్లో గురువారం కంటివెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ చిన్నదేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లు మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా మందులు, కళ్లఅద్దాలు అందజేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు, మున్సిపల్ మేనేజర్ రాజేష్, బీఆర్‌ఎస్ టౌన్ ప్రసిడెంట్ ఎండీ మైబు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో గురువారం సర్పంచ్ చిన్నదేవుడు, ఎంపీటీసీ సోమన్నగౌడ్, డాక్టర్ రిజ్వాన తన్విర్‌లతో కలిసి కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభించారు. 137 మందికి కంటి పరీక్షలు, 31 మందికి కళ్ల అద్దాలు అందజేశారు. 64 మందికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వీనా, పీహెచ్‌ఎన్‌ఓ సత్యానారాయణ, ఏఎన్‌ఎంలు షాజహాన్, ప్రసన్నకుమారి, రుబెనా, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామ పంచాయతీ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో 138 మందికి పరీక్షలు నిర్వహించారు. 17 మందికి అద్దాల పంపిణీ, 18 మందికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి యాకుబ్ బాషా, పంచాయతీ కార్యదర్శి రవి, పాల్గొన్నారు.

మల్దకల్: మండలంలోని మల్లెందొడ్డి, తాటికుంట గ్రామాలలో గురువారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. మొత్తం 284 మంది కంటి పరీక్షలు చేసుకోగా 8 మందికి కంటి అద్దాలు, 26 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. డాక్టర్ స్వరూపరాణి, హెల్త్ సూపర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఇటిక్యాలపాడులో..

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

అయిజ: రాష్ట్రాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శాసన మండలి బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా గురువారం పట్టణంలోని వివిధ కాలనీల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడారు. అపరిష్కృతంగా ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం ఏవీఎన్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. మండలిలో ఉపాధ్యాల సమస్యలపై ప్రశ్నించేవారిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి భగత్‌రెడ్డి, రఘు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

వరి పంట తెగుళ్లతో అప్రమత్తం



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

పెబ్బేరు: మండలంలోని బునాదిపురం శివారులోని వరి పంటలను గురువారం వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యాసంగిలో వాతావరణం మార్పుల వల్ల వరి పంటలు ఎదుగుదల లేక పోవడంతో పాటు అగ్గి తెగులు, సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నాయని రైతులకు హెచ్చరించారు. వాటి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని, అగ్గితెగులు ఆశించినప్పుడు ఆకులపై మచ్చలు, నలుపు, ముదురు గోధుమ రంగు మచ్చల మధ్య బూడిద లేక తెలుపు రంగులో మచ్చలు ఉండి పాక్షికంగా లేదా మొత్తం ఎండిపోతాయని తెలిపారు. వీటికి నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా లేదా ఐసోప్రోథయాలేన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లీటరు నీటికి చొప్పున కలుపుకొని తెగులు ఉధృతి, నెలకొన్న వాతావరణ పరిస్థితులను బట్టి 10 నుంచి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యం బాబు, వ్యవసాయ అధికారి చంద్రమౌళి, ఏఈఓ నరేష్, రైతులు విజయ్‌గౌడ్, ఎల్లస్వామి, రవీందర్, కురుమన్న, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

శాఖాహారంతో రుగ్మతలు దూరం

శాంతినగర్: శాఖాహారంతో రుగ్మతలు దూరం అవుతాయని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయ రెడ్డి అన్నారు. గురువారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని ప్రజలకు, విద్యార్థులకు ధ్యానం, ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాంసాహారంలో కంటే శాఖాహారంలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయని, మాంసాహారం తీసుకోవడం వల్ల పలు రకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతి నిత్యం ధ్యాన సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం కలుగుతాయన్నారు. కార్యక్రమంలో కృష్ణ, మద్దిలేటి, వెంకటలక్ష్మి, గుండం, శైలజ, స్వప్న, శోభిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠాలు బోధించి..



శాంతినగర్‌లోని రామాపురంలో ..

ధరూరు: మండల కేంద్రంలోని కుర్వ వీధిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు హెచ్‌ఎంగా శివలీల, ఎంఈఓగా నవీన్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణి, ఉపాధ్యాయులు కే మాధవి తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్: మండలంలోని రామాపురం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు అధికారులు, ఉపాధ్యాయుల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.

రాజోళి: మండలంలోని పెద్ద తాండ్రపాడు ఎంపీపీఎస్ పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కలెక్టర్‌గా, డీఈఓగా, మండల అధికారులుగా వ్యవహరించి ప్రతిభ చాటారు. మరికొందరు ఉపాధ్యాయ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధన్న, గురుప్రసాద్, రమేష్, ప్రశాంత్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



ధరూరులో ..



రాజోళిలోని పెద్ద తాండ్రపాడులో..